నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 14 జూన్ 2025 SIDDIPET




కేసీఆర్, హరీశ్‌రావును కలిసిన గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

## కేసీఆర్‌ను కలిసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 13: బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తన పుట్టినరోజు శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ప్రతాప్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన సంగారెడ్డి కలెక్టర్

- కలెక్టర్ ప్రావీణ్యకు శుభాకాంక్షల వెల్లువ



సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: సంగారెడ్డి కలెక్టర్‌గా పి.ప్రావీణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఐబీ అతిథి గృహానికి చేరుకున్న ఆమెకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్ పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని తన చాంబర్‌లో నూతన కలెక్టర్‌గా పి.ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారైన ప్రావీణ్య ఇప్పటి వరకు హనుమకొండ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీ అయ్యారు. అంతకుముందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సంగారెడ్డి కలెక్టర్‌గా పని చేసిన వల్లూరు క్రాంతి టూరిజం మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.

## ఇక్రిసాట్‌లో పవన్ కల్యాణ్



ఇక్రిసాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో కుటుంబ సభ్యులతో పవన్ కల్యాణ్

పటాన్‌చెరు రూరల్, జూన్ 13 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని అంతర్జాతీయ విత్తన పరిశోధన సంస్థ ఇక్రిసాట్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు పవన్ కల్యాణ్ సందర్శించారు. ఇక్రిసాట్ ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్‌లో తన కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్‌ను జాయిన్ చేసేందుకు వచ్చారు. పాఠశాలను స్వయంగా పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన కుమారుడికి స్కూల్‌లో అడ్మిషన్ ఇప్పించినట్లు సమాచారం. మార్క్ శంకర్ పవనోవిచ్ ఇటీవల సింగపూర్‌లో తాను చదువుతున్న స్కూల్‌లో అగ్నిప్రమాదంలో గాయపడి కోలుకున్న సంగతి తెలిసిందే. పిల్లవాడి భద్రత, నాణ్యమైన విద్యపై అన్ని రకాలుగా ఆలోచించి ఇక్రిసాట్‌లోని స్కూల్‌ను ఆయన ఎంపిక చేసుకున్నట్టుగా తెలిసింది. ఇక్రిసాట్‌లోని స్కూల్ అంతర్జాతీయ ప్రమాణాలతో, చక్కటి పర్యావరణంలో ఉంటుంది.

## మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన చైర్మన్



మంత్రి వడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, జూన్ 13: మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకుని షెడ్యూల్ కులాలు, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్‌ను శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి సంక్షేమానికి సహకరించాలని మంత్రిని ఆయన కోరారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు ఉన్నారు.

# పత్తి రైతుకు విత్తన భారం





- ఈ ఏడాది పెరిగిన విత్తనాల ధరలు
- గతేడాదితో పోలిస్తే ప్యాకెట్‌కు రూ.50 అదనం
- గతేడాది ప్యాకెట్ ధర రూ. 864.. ప్రస్తుతం పెరిగిన ధరతో కలిపి రూ. 910
- ఈ ఏడాది సంగారెడ్డి జిల్లాలో 3.87 లక్షల ఎకరాలు పత్తి సాగుచేసే అవకాశం
- జిల్లా రైతులపై రూ. 3.87 కోట్ల అదనపు భారం
- ఆందోళనలో అన్నదాతలు.. రైతు భరోసా అందక తిప్పలు

**పత్తి విత్తన ప్యాకెట్ ధరలు**

| ఏడాది | ధర... |
|---|---|
| 2019 | రూ. 710 |
| 2020 | రూ. 730 |
| 2021 | రూ. 767 |
| 2022 | రూ. 810 |
| 2023 | రూ. 853 |
| 2024 | రూ. 864 |
| 2025 | రూ. 910 |

సదాశివపేట, జూన్ 13: అన్నదాత కష్టం అంతా ఇంతాకాదు. ఆరుగాలం కష్టపడి పండిస్తే మిగిలేది అంతంతమాత్రమే. ప్రారంభంలో నకిలీ విత్తనాల బెడద, పంట పెరుగుతున్న క్రమంలో చీడపురుగుల బాధ.. అందులో అకాల వర్షాలు వస్తే అంతే సంగతి. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట వర్షార్పణం. పండిన పంట కాస్త గిట్టుబాటు ధర లేక..దళారుల మోసాలు ఇలా అన్నీ రైతులకు కష్టాలే. దీనికి తోడు ఈ ఏడాది పత్తి విత్తన కంపెనీలు ధరలు పెంచాయి. గతేడాది సాధారణ పత్తి విత్తనాల ప్యాకెట్‌కు రూ. 864 ఉండగా, ఈ ఏడాది అదనంగా రూ.40 నుంచి రూ. 50 దాకా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. సంగారెడ్డి జిల్లాకు 7,75,078 ప్యాకెట్లు అవసరం ఉండగా, ప్రస్తుతం పెరిగిన ధరతో రూ. 3.87 కోట్లకు పైగా అదనపు భారం రైతులపై పడనున్నది.

### 3.87 లక్షల ఎకరాలలో సాగు

సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా పత్తి పంట సాగుచేస్తారు. గతేడాది 3.60లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట పండించారు. ఈ ఏడాది 3,87,539 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందుకు 7,75,078 విత్తనాల ప్యాకెట్లు అవసరం అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. ఇక సీజన్ ప్రారంభమైందంటే చాలు అనేక కంపెనీల పేర్లతో వందలాది రకాల విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఇందులో నకిలీవి ఏవో, అసలివి ఏవో తెలియని పరిస్థితి ఉంటుంది. ప్రధానంగా మార్కెట్‌లో బీటీ-1, బీటీ-2 రకాలు అందుబాటులో ఉంటుండగా, రైతులు ఎక్కువగా బీటీ-2 రకాలే కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలకు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. లేదంటే పత్తి విత్తనాల కోసం వచ్చే రైతులకు ఒకటి, రెండు ప్యాకెట్లకే పరిమితం చేస్తున్నారు. అనేక కంపెనీలు పలు రకాల విత్తనాలను అందుబాటులో ఉంచినప్పటికీ, రైతులు మొగ్గుచూపే బ్రాండ్లకు ధరలు పెంచుతున్నారు.

### జిల్లా రైతులపై రూ. 3.87 కోట్లకు పైగా భారం

ఈ ఏడాది సంగారెడ్డి జిల్లాలో 3,87,539 ఎకరాల్లో పత్తి సాగుచేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందుకు 7,75,078 విత్తనాల ప్యాకెట్లు అవసరమవుతాయని అంచనా వేసింది. సాధారణ పత్తి విత్తనాలకు రూ. 40 నుంచి రూ. 50 దాక ధర పెరగగా (బ్రాండెడ్ పత్తి విత్తనాలకు రూ.100 నుంచి రూ. 200 వరకు) ఈ లెక్కన రూ. 3,87,53,900లకు పైగా భారం రైతులపై పడనున్నది. గతేడాది సాధారణ రకం పత్తి విత్తనాల ప్యాకెట్‌కు రూ. 864 ఉంటే, ఈ ఏడాది రూ. 900 నుంచి 910 వరకు చేరింది.కాలంతో సంబంధం లేకుండా ఏటా పత్తి విత్తనాల కంపెనీలు విత్తన ప్యాకెట్ల ధరలు పెంచుతూ రైతులపై భారాన్ని మోపుతున్నాయి. ఎనిమిదేండ్లుగా కంపెనీలు రైతు నెత్తిన ధరల పేరుతో గుదిబండను ఎత్తుతున్నాయి. ఒక పత్తి ప్యాకెట్‌పై రూ. 50 ఈ సీజన్‌లో అదనంగా పెరిగింది. ప్రస్తుత సాగు లెక్కల ప్రకారం ప్రతి ఎకరాకు 2 పత్తి ప్యాకెట్లు అవసరం ఉంటాయి. ఆ లెక్కన 7,75,078 విత్తన ప్యాకెట్లు అవసరం ఉన్నాయి. దీంతో రూ. 3,87,53,900ల ఆర్థిక భారం రైతులపై పడనున్నది. ఇప్పటికే గతేడాది పంటల దిగుబడి సరిగ్గా లేక రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. విత్తన ధర పెంపుతో మరింత ఆర్థిక భారం పడిందని చెప్పవచ్చు. బీఆర్ఎస్ సర్కార్‌లో రైతుబంధు పథకం ద్వారా ఏటా రెండు సీజన్లకు ఎకరాకు రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయం అందించింది. పంటల సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించడంతో రైతులు రంది లేకుండా పంటలు సాగు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెట్టుబడి (రైతు భరోసా) సాయం అందించక పోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

## మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే



యువ విద్యార్థి ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- వ్యసనాలకు దూరంగా ఉండాలి
- మండుటెండల్లో పాదయాత్ర చేసిన మీకు ధన్యవాదాలు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 13: కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఫెయిల్ అయ్యిందని, సీఎం రైతులను, ఉద్యోగులను, విద్యార్థులను, వృద్ధులను, యువతను ఇలా అన్ని వర్గాలను మోసం చేశారని, మూడేండ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో మళ్లీ గెలిచి అధికారం చేపట్టేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని మేలో ఎల్కతుర్తి వద్ద నిర్వహించిన బహిరంగ సభకు సిద్దిపేట నుంచి యువత పాదయాత్రగా తరలివెళ్లి విజయవంతం చేశారు. గురువారం రాత్రి సిద్దిపేటలో రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన యువ విద్యార్థి ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొని పాదయాత్ర చేసిన యువతను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత వ్యసనాలకు బానిస కావద్దన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్‌తో కొందరు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, బెట్టింగ్ భూతానికి దూరంగా ఉండాలన్నారు. పని చిన్నదా పెద్దదా అనేది ముఖ్యం కాదని, ఏదో ఒక పనిచేసి ముందు జీవితంలో స్థిరపడాలన్నారు. మీలో ప్రతి ఒక్కరూ ఒక్కో నాయకుడు కావాలని, అం దుకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని హరీశ్‌రావు ధీమా ఇచ్చారు. మద్యం, డ్రగ్స్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తన టీమ్‌లో అలాంటి వ్యసనపరులకు స్థానం లేదన్నారు. కార్యక్రమం లో నాయకులు కడవేర్గు రాజనర్సు, పూజల వెంకటేశ్వరరావు, కొండం సంపత్‌రెడ్డి, శ్రీహరి యాదవ్, బర్ల మల్లికార్జున్, ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేశ్, తిరుమల్ రెడ్డి, మేర్గు మహేశ్, రెడ్డి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## భజన మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



సంగారెడ్డిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి, జూన్ 13: కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ భజన చేయడం మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 57 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన పనులకు కాంగ్రెస్ నేతలు ఇప్పుడు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సంగారెడ్డికి రూపాయి నిధులు రావడం లేదన్నారు. పక్క నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు జరుగుతుంటే, సంగారెడ్డి కాంగ్రెస్ నాయకులు ఎందుకు నిధులు తెచ్చి అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.వెంకటేశ్వర్లు, నర్సింలు, నాయకులు చిలువేరి ప్రభాకర్, మోహన్‌రెడ్డి, జీవి శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, శ్రావణ్‌రెడ్డి, అంజాద్, శ్రీకాంత్ నాగరాజు, మల్లాగౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: సంగారెడ్డిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 374లోని ప్రభుత్వ స్థలంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇండ్లు లేకుండా ఇంటి నెంబరు పొంది అధికారులను తప్పుదోవ పట్టించి, జీవో నెంబరు 59 ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త త్రివిక్రమ రావు తదితరులు పాల్గొన్నారు.

## పేరుకు కంకోల్.. సేవలు రాయికోడ్‌కు

- కంకోల్ హెల్త్ సబ్ సెంటర్ 108 అంబులెన్స్ రాయికోడ్‌కు తరలింపు
- మంత్రి దామోదర ఆదేశాలు బేఖాతరు



రాయికోడ్ సర్కార్ దవాఖానకు తరలించిన మునిపల్లి మండలం కంకోల్ 108 వాహనం

మునిపల్లి, జూన్ 13: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖాన, ఇటీవల ప్రారంభించిన హెల్త్ సబ్‌సెంటర్ ప్రజలకు అందుబాటులో ఉంచడానికి 108 అంబులెన్స్‌ను సమకూర్చారు. మునిపల్లి మండల ప్రజల సౌకర్యార్థం మంత్రి దామోదర ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ కంకోల్ హెల్త్ సబ్ సెంటర్ వద్ద ఉండి సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ, సంబంధిత అధికారులు దానిని రాయికోడ్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

దీంతో మునిపల్లి మండల ప్రజలకు సరిగ్గా 108 అంబులెన్స్ సేవలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిపల్లి మండలం మీదుగా జాతీయ రహదారి వెళ్తున్నది. తరుచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అత్యవసర సేవలు అందించడానికి 108 అంబులెన్స్ చాలా అవసరం.కానీ, ఇవేవి పట్టించుకోకుండా అధికారులు రాయికోడ్‌కు అంబులెన్స్ ఎలా పంపుతారని మండల వాసులు మండిపడుతున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు జిల్లా అధికారులు స్పందించి 108 అంబులెన్స్‌ను మునిపల్లికి పంపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## అటు చదువుకు.. ఇటు సాగుకు!
# పైసలకు పాట్లు

పటాన్‌చెరు, జూన్ 13: జూన్ అంటేనే పేద, మధ్య తరగతి జీవుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంతో పాటు వానకాలం సాగు పనులు షురూ కావడంతో ప్రతి ఒక్కరూ డబ్బుల వేటలో నిమగ్నమయ్యారు. పిల్లలను విద్యాసంస్థల్లో చేర్పించడానికి తల్లిదండ్రులకు ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ప్రైవేటు విద్యాసంస్థలు ఈ ఏడాది భారీగా ఫీజులు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతున్నది. వ్యవసాయ పెట్టుబడులకు రైతు కుటుంబాలకు డబ్బులు అవసరం. దీంతో రైతులు, ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, సామాన్యులు, అప్పులు చేస్తున్నారు. రైతులు పంటలు సాగు చేసేందుకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. పిల్లలను పాఠశాలకు పంపించేందుకు పుస్తకాలు, యునిఫామ్స్, బూట్లు, క్యారేజ్ బాక్సులు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగులు, నోటు బుక్‌లు, పెన్నులు కొనుగోలు చేయాలి. ఆటోలు, బస్సుల చార్జీలు ముందుగానే చెల్లించాలి. విద్యార్థుల అడ్మిషన్ ఫీజులు సైతం గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా పెంచడంతో భారం పెరిగిపోయింది. ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్ ఫీజుకు రూ. 3.50 లక్షల వరకు చెల్లించాల్సి వస్తున్నది. నీట్, ఎంసెట్, జేఈఈ, వాటికి మరింత అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. సామాన్యులు, చిరుద్యోగులకు, కార్మికులకు, కూలీలకు భారంగా మారింది. ఫీజులు నియంత్రణ చేస్తామని ప్రతి ఏడాది సర్కార్ ప్రకటిస్తున్నా అమలు కావడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు వసూలుపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సామాన్యులకు విద్యాభారం కాకుండా చూడాలని డిమాండ్లు ఎప్పటి నుంచో ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ అనుమతి లేకుండా సాగుతున్నా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ఘటనలు వెలుగుచూశాయి. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అనుమతి ఒకచోట తీసుకుని మరోచోట నడిపిస్తున్నారు. ఫిర్యాదు చేస్తేనే విద్యాశాఖ అధికారులు స్పందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పటాన్‌చెరు ప్రాంతం హైదరాబాద్ సమీపంలో ఉండడంతో ఓఆర్ఆర్ సమీపంలో, పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రాంతంలో వందల ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోయినా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

### విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల భయం..

జూన్ అంటేనే సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఫీజుల భయం పట్టుకుంది. ఫీజులు, పుస్తకాలు యూనిఫాంతో పాటు అన్ని ఖర్చులు ఒకేసారి రావడంతో ఆర్థికభారం పడుతున్నది. నర్సరీ నుంచి పదో తరగతి చదుకుతున్న విద్యార్థులకు అధికంగా ఫీజులు చెల్లించే పరిస్థితి ఉంది. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబంలో రూ. 50 వేల నుంచి రూ. 75 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నది. నర్సరీలో అడ్మిషన్ ఫీజులు రూ. 25 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు నేరుగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు

**జూన్ నెలంతా ఖర్చులే**

- తల్లిదండ్రులపై ఫీజుల భారం
- ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీ'జులుం'
- పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు
- రైతులకు అందని రైతుభరోసా.. పెట్టుబడులకు అప్పులే శరణ్యం

చేస్తున్నా చర్యలు లేవు . బయట షాపుల్లో కొనుగోలు చేయకుండా వారే పాఠశాలలో అమ్మకాలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పాఠశాల బస్సులకు ముందుగానే ఫీజులు తీసుకుంటున్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం పేద, మధ్య తరగతి, సామాన్యులు కష్టపడి సంపాదించిన మొత్తం ఫీజుల రూపంతో ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించాల్సి వస్తున్నది.

### అన్నదాతలకు పెట్టుబడి భయం

వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు విత్తనాలు వేసేందుకు విత్తనాలు, ఎరువులు, ట్రాక్టరు కోసం డబ్బులు అవసరం. ఎకరం భూమిలో విత్తనం వేసేందుకు రూ. 10 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఐదెకరాల వరకు భూమి ఉంటుంది. దీంతో ప్రతి రైతు వానకాలం సీజన్‌లో రూ. 50 వేల వరకు ఖర్చు చేస్తారు. విద్యార్థుల ఫీజులు, పంట సాగు కోసం రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. ఖర్చులు పెరిగిపోవడంతో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో రైతులు పశువుల ఎరువులతో చిరుధాన్యాల పంటలు సాగు చేసేవారు. ప్రస్తుతం ఖర్చులు పెరిగిపోవడం వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. డీజిల్ ధర పెరిగిపోవడంతో రైతులకు భారంగా మారింది. ఎక్కువ మంది రైతులు ట్రాక్టరు సహాయంతో వ్యవసాయం చేస్తున్నారు. రైతుభరోసా రాకపోవడంతో అన్నదాతలు పంట పెట్టుబడులకు అప్పులు చేయాల్సి పరిస్థితి ఉంది.



### స్కూల్ ఫీజులు నియంత్రించాలి..



రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి. ప్రతి ఏడాది ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచుతున్నాయి. పటాన్‌చెరు ప్రాంతంలో కార్మికులకు జీతాలు తక్కువగా ఉండడంతో పిల్లల చదువుల కోసం అప్పులు చేసే పరిస్థితి ఉంది. ప్రభుత్వ బడులపై నమ్మకం లేక నాతో పాటు చాలామంది పిల్లలను భారమైనా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫీజులు పెరిగిపోవడంతో సామాన్యులు అప్పులు చేయడం, ఉన్న భూములు అమ్మి పిల్లలను చదివించాల్సి వస్తున్నది. – సుభాష్, పటాన్‌చెరు

### ఇష్టారీతిగా ఫీజుల పెంపు



ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా విద్యాశాఖ చర్యలు తీసుకోవడం లేదు. ఫీజులు నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలి. పేద, మధ్య తరగతి, సామాన్యులు తమ పిల్లల చదువుల కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోయినా ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజులు నియంత్రణకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలి. సర్కారు బడులను బలోపేతం చేయాలి.

– ఐలాపూర్ మాణిక్‌యాదవ్, పటాన్‌చెరు

## కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి
- సిద్దిపేటలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు



సిద్దిపేటలో ఎడ్ల గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న కూనంనేని సాంబశివరావు

సిద్దిపేట, జూన్ 13: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని హామీలు అమలు చేయాలని, రైతులకు రైతు భరోసా, పంట రుణ మాఫీ పూర్తిగా అమలు చేయడానికి రేవంత్ సర్కారు అపసోపాలు పడుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిద్దిపేటలో గురువారెడ్డి విగ్రహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి ఆయన నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా మభ్యపెట్టడం తగదన్నారు. జర్నలిస్టుల కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రవేశపెట్టాలన్నారు. మోదీ సర్కార్ నక్సలైట్లతో శాంతి చర్చలకు ముందుకు రావాలని కోరారు. విద్య, వైద్య పరంగా మన దేశం ప్రపంచంలో 126వ స్థానం ఉండడం బాధాకరమన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఐదు లక్షల మందితో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిష్టాపురం లక్ష్మణ్, బన్సీలాల్ పాల్గొన్నారు.